రాజ్యాధికారంతోనే మెజార్టీ ప్రజలకు న్యాయం


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగచారి

నాగోలు: స్వాతంత్ర్య వచ్చి ఏడుదశాబ్దాలు గడిచినా కార్మిక కర్షక, బహుజనులకు రాజ్యాధికారం రాకపోవడం మెజార్టీ ప్రజల వెనుకబాటుకు కారణమని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగచారి అన్నారు. సోమవారం కొత్తపేటలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలన్నారు. 85%గా కార్మిక కర్షక బహుజనులే దేశంలో సంపద సృష్టిస్తే ఆ సంపదంత పిడికెడు మంది చేతిలో బందీగా ఉండటంతోనే దేశం వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. మార్చి 3న జరిగే వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రథమ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక, కర్షకులు మేధావులు కవులు కళాకారులు ప్రతి ఒక్కరూ హాజరై వర్కర్స్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ కోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ దుర్గే, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.శ్రీనివాస్, నరసింహచారి, రాములు, కొప్పు యాదయ్య, రమేష్, సోమేశ్వరరావు, మహమ్మద్ కిర్మణ్, కృష్ణమాచారి, మహిళా సమాఖ్య కన్వీనర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట ఏరియా ఆస్పత్రి కార్మికుల నిరసన

జీతాలు చెల్లించాలని డిమాండ్


నిరసనలో సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్, పేషెంట్ కేర్ సిబ్బంది

మలక్‌పేట: మలక్‌పేట ఏరియా ఆస్పత్రి కార్మికులు జీతాలు చెల్లించాలని విధులు బహిష్కరించి సోమవారం నిరసన తెలిపారు. గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఏజెన్సీ కింద పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్ సిబ్బంది 58 మంది కార్మికులు ఏఐటీయూసీ అనుబంధ సంఘం మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో ధర్నాకు దిగారు. ధర్నాకు దిగుతున్నట్లు డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఏజెన్సీలకు వారం రోజులక్రితం వినతిపత్రం అందజేసినట్లు కార్మికులు తెలిపారు. మూడునెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎఫ్, పీఎఫ్ కూడా నెలనెల కట్ అవ్వడం లేదని, ఇతర ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లిస్తున్నారని, ఈఎఫ్, పీఎఫ్ కూడా కట్ అవుతుందన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు ఇచ్చే వరకు విధులకు హాజరుకాబోమని కార్మికులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు పరిధిలోని హయత్‌నగర్ కోర్టు ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయిరెడ్డి తెలిపారు. సోమవారం కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో హయత్‌నగర్ న్యాయమూర్తులు సల్మా ఫాతిమా, సంకేత్ మిత్రలు ఇటీవల అధునీకరించిన సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులకు వైద్య పరీక్షలు నిర్వహించిన సిబ్బంది వారికి ఆరోగ్యరీత్యా పలు సూచనలు చేశారు. న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్ష కార్యదర్శులు అనిల్, రవి, ఉపాధ్యక్షుడు మాణిక్ ప్రభు, సంచాలకులు కాటంగూరి బుచ్చిబాబు, శ్రీనాథ్, మహేశ్, పీపీ సునిత బర్ల, న్యాయవాదుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో మొత్తం 120 మందికి బీ.పీ, మధుమేహం, ఈసీజీ, ఆర్థోపెడిక్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు



నాగోలు: బండ్లగూడలోని శ్రీనివాసకాలనీలోని సీతారామచంద్రస్వామివారి ఉత్సవమూర్తి సహిత అభయాంజనేయస్వామి దేవాలయంలో దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి లక్ష్మీరామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతం, నిత్య అరాధన పంచామృత, సిందూరాభిషేకం, సహస్ర ఆకుపూజ అలంకరణ, బాలబోగం తీర్థగోష్టి, శ్రీవిష్వక్షేనారాధన, పుణ్యాహవనం రక్షాబంధనం, మన్యుసూక్తమాల మంత్రహోమం, హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామపారాయణం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి


లాప్‌టాప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రామంతాపూర్: భరత్‌నగర్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన కల్చరల్ టెస్ట్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేటర్ బండారు శ్రీవాణి స్కూల్ చైర్మన్ సూరం రాంరెడ్డితో కలిసి పదవ తరగతి విద్యార్థులకు లాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు తమ బీఎల్ఆర్ సంస్థ తరపున ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమతారెడ్డి, మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జిలు ఎల్బీరావు, చొక్కాయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీపీఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు సభ్యత్వం పట్ల ఆసక్తి చూపుతున్నారన్నారు. సీపీఐ పేదల పక్షాన నిలబడి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. పేదలపై జరిగే అన్యాయాలు, అక్రమాలపై సీపీఐ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడిపల్లి మండల కార్యదర్శి దండు రమేష్, ఇందిరానగర్ శాఖ కార్యదర్శి మాచర్ల కనకయ్య, పార్టీ సభ్యులు వెంకటమ్మ, లక్ష్మి, మణెమ్మ, సుజాత, రమేష్, అంజనేయులు, రజిత, యాకుబ్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న పిల్లి శ్రీనివాస్ రావు

కాచిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ మహిళా కమిటీ అధ్యక్షురాలు చామకూర సుజాత అధ్యక్షతన సోమవారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్‌లో మహిళా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నతనం నుంచే నేర్పించాలని సూచించారు.ఫిబ్రవరి 14న వాలంటైన్స్ డేను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, అది మన సంస్కృతి కాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో మున్నూరు కాపులందరూ కులగణన పత్రంలో మున్నూరుకాపు అని మాత్రమే రాయాలని సూచించారు. మహిళా దినోత్సవం మార్చి 8న శివరాత్రి పండుగ ఉన్నందున మార్చి 10న నిర్వహించనున్నట్లు మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత తెలిపారు. నగేష్, అన్నపూర్ణ, అన్నం శాంతి ప్రియ, జయశ్రీ. అనూష, గానవి గోదాసి, రాకేష్ పాల్గొన్నారు.

త్వరలో సమస్యలకు పరిష్కారం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ జీహెచ్ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి సోమవారం కుమ్మరికుంటలో విస్తృతంగా పర్యటించారు. కాగా స్థానికులు తమ సమస్యలను కార్పొరేటర్‌తో ఏకరువు పెట్టుకున్నారు. వరద నీటి కాలువలను ఏర్పాటు చేయాలని, కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్స్ చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని, చాలా వరకు లో ఓల్టేజీ సమస్య ఉందని తెలిపారు. దీంతో సంబంధిత అధికారులను కార్పొరేటర్ అప్రమత్తం చేసి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలలేమి !


పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు ఇలా..


పేరుకుపోయిన చెత్తాచెదారంతో..

- అధ్వానంగా భూపేశ్‌గుప్తానగర్ ప్రాథమిక పాఠశాల
- అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికుల ఆవేదన
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు


తాగి పడేసిన మద్యం సీసాలు ఇలా..

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలోనిప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కనీసవసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు ఓ వైపు, చెత్త కాగితాలు మరోవైపు దర్శనమిస్తున్నాయి.

ఆకతాయిలకు అడ్డాగా..

ఆకతాయిలు మద్యం తాగి పాఠశాల ఆవరణలోనే తాగిన మద్యం బీరు సీసాలను పారవేస్తున్నారని, పాఠశాల అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం..

ప్రభుత్వ పాఠశాలలో అసాంఘీక కార్యకలాపాలు కొనసాగుతున్నా.. అటు విద్యాశాఖ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు, పాఠశాల గురించి పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి..



భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. పాఠశాలలో ఆకతాయిలు మద్యం తాగి పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లను వదిలేస్తున్నారు. పాఠశాల ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. సంబంధిత అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

– నారగోని శ్రీనివాస్‌యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

నియామకం


మిద్దెల మల్లేషంగౌడ్

మన్సూరాబాద్: డివిజన్ పరిధి శుభోదయకాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా మిద్దెల మల్లేశంగౌడ్‌ను ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీ సమస్యలను ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

చలో నల్గొండ సభను విజయవంతం చేద్దాం


మురుకుంట్ల అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: జల హక్కులు కాపాడేందుకు 13న నల్గొండలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఆర్‌కేపురంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు చలో నల్గొండ సభకు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థ నాయకులు, సబితమ్మ అభిమానులు పాల్గొనాలని కోరారు.

24న ఉచిత మెగా వైద్యశిబిరం

నాగోలు: మల్లారెడ్డి సేవా ట్రస్ట్ సహకారంతో సన్ షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సన్‌షైన్ ఫౌండేషన్ చైర్మన్ చరణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఓపీడీ కన్సల్టేషన్, రక్త పరీక్షలు, ఈసీజీ, ఎక్స్‌రే చెకప్, శస్త్ర చికిత్సలు, గర్భిణీలకు ప్రత్యేక ప్యాకేజీలు ఉన్నట్లు తెలిపారు. కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధి నిపుణులు, దంత వ్యాధి నిపుణులు, ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

మహిళ అదృశ్యం


యాదమ్మ (ఫైల్)

నాగోలు: మానసిక పరిస్థితి సరిగ్గా లేని ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు పరిధిలోని సాయినగర్ కాలనీలో నివసించే కె. యాదమ్మ(43) గత కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంటివద్దే ఉంటుంది. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. వారు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి


ముడావత్ రాజు (ఫైల్)

సైదాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న చంచల్‌గూడ కేంద్ర కారాగారంలోని రిమాండ్ ఖైదీ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంచల్‌గూడ జైలు సూపరిండెంట్ శివకుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనం కేసులో నిందితుడైన ముడావత్ రాజు (36) ఈనెల 6న చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌పై చేరుకున్నాడు. ఆదివారం రాత్రి హైబీపీ, పక్షవాతం వచ్చిన లక్షణాలు కనిపించడంతో జైలు సిబ్బంది చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడని ఆయన వివరించారు.

కొండెక్కిన వెల్లుల్లి..

మలక్‌పేట్ మార్కెట్‌లో కిలో రూ.450

చాదర్‌ఘాట్: వెల్లుల్లి ధరలు కనీవిని ఎరుగని రీతిలో ఘాటెక్కాయి. మలక్‌పేట మార్కెట్‌లో హోల్‌సేల్ క్వింటాకు రూ.40,000, రిటైల్‌గా కిలో రూ.450 నుంచి రూ.500 వరకు వ్యాపారస్తులు అమ్ముతున్నారు. దీంతో రుచికి అలవాటుపడిన వారు మనసు చంపేసుకుంటున్నారు.

- రెండు వారాల్లోనే వీటి ధరలు రెట్టింపయ్యాయి. గత నవంబర్ నుంచి వెల్లుల్లి ధరలు పెరగటం మొదలయ్యాయని వ్యాపారస్తులు తెలిపారు.
- డిసెంబర్ నెలలో వెల్లుల్లి ధర కిలో రూ. 250 ఉండగా.. రిటైల్ మార్కెట్‌లో రూ. 350 నుంచి 400 వరకు పలికింది.
- వెల్లుల్లి దిగుబడి భారీగా పడిపోవడంతో ధరలు ఆకాశానికి ఎక్కాయని వ్యాపారులు తెలిపారు.
- కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో జులైలో వేసిన పంట దెబ్బతిందని అధికారులు తెలిపారు. ప్రతిరోజు మార్కెట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 10 లారీల వరకు వచ్చేవని, ప్రస్తుతం రోజుకు రెండు లారీలు రావడమే గగనమయిందని అధికారులు తెలిపారు.

బ్లాక్‌మార్కెట్‌లో అమ్మితే కఠిన చర్యలు..

వర్షాభావంతో వెల్లుల్లి ఉత్పత్తి తగ్గి రేటు పెరిగింది. గత రెండు నెలల వరకు ఇదే విధంగా ధరలు ఉంటాయి. మార్కెట్‌లో ఎవరైనా బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. ధరల విషయంలో వ్యాపారులు వినియోగదారులకు సహకరించాలి. – వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్

ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రమేష్‌బాబు

మలక్‌పేట: జేటీసీ రమేష్ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మలక్‌పేట ఆర్టీఏ కార్యాలయంలో సోమవారం ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రమేష్‌బాబు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా లైసెన్స్ తీసుకోవాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు నడిపేవారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతీ వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. వాహనాల పత్రాలు సకాలంలో రెన్యూవల్స్ చేయించుకోవాలన్నారు. ప్రమాద రహిత సమాజం, సురక్షిత ప్రయాణం కోసం రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలన్నారు. ఎంవీఐలు నరేంద్రపాల్, ఉమ, మున్నీ, అరుణ, ఏఎంవీఐలు రజినీ, సైదా, ఏఓలు విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మధుకర్, సిబ్బంది జయపాల్‌రెడ్డి, గౌస్‌పాషా పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ


ఫిర్యాదులను తీసుకుంటున్న హయత్‌నగర్ సర్కిల్ డీసీ రవీందర్‌కుమార్

ఎల్‌బీనగర్: ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి'లో భాగంగా ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు.ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో మొత్తం 5 ఫిర్యాదులు రాగా.. అందులో 2 టౌన్ ప్లానింగ్, మరో మూడు ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు అధికారులు ప్రకటించారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మూడు ఫిర్యాదులు రాగా.. మూడు టౌన్ ప్లానింగ్ పైనే వచ్చినట్లు సర్కిల్ డీసీ రవీందర్‌కుమార్ తెలిపారు. వీటిపై సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలి

కాచిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములవ్వాలని బద్రుకా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా పిలుపునిచ్చారు. కాచిగూడలోని బద్రుకా కళాశాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సోమవారం నిర్మాణ్ ఎన్జీవో సంస్థ వ్యవస్థాపక సీఈఓ మయూర్ పటియాలతో బద్రుకా విద్యా సంస్థలు ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, లియో క్లబ్, స్టూడెంట్ ఛాప్టర్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లోని మురికివాడల్లో పేదలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ్ సంస్థ సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బద్రుకా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలక మండలి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సోమవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మెట్రో వాటర్ వర్క్ అధికారులతో సమావేశం గురించి, గుంతలుగా ఉన్న ప్రధాన రహదారులపై, పెండింగ్ సమస్యలపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని వారు వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, తోటకూర అజయ్‌యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, రాసాల వెంకటేశ్‌యాదవ్, బింగి జంగయ్యయాదవ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు పులకండ్ల జంగారెడ్డి, గుర్రాల వెంకటేశ్ యాదవ్, వెంకటేశ్‌గుప్తా, దానగల్ల యాదగిరి తదితరులున్నారు.

నేడు కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/సరూర్‌నగర్/వనస్థలిపురం: రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో) టమోటా లోకల్ రూ.19, వంకాయ రూ.15, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ 45, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 23, క్యారెట్ 23. దొండ 40, ఆలుగడ్డ 24, ఉల్లి 19, గోకర 45, దోస 21, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటి 09, చిక్కుడు 40, అర్వి 55, మునగ 65, చిలగడదుంప 60, బీట్‌రూట్ 23, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ రూ. 55గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతో దోహదం చేస్తుందని, పేదలకు ఇది ఒక వరమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అల్తాఫ్ నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావు కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆపరేషన్‌కు సరిపడ డబ్బు లేకపోవడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆయన కుటుంబసభ్యులు సంప్రదించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చికిత్స వివరాలతో ఎల్‌ఓసీకి బాధితులతో దరఖాస్తు చేయించారు. చికిత్స నిమిత్తం ఎల్‌ఓసీ కింద మంజూరైన రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును ఎమ్మెల్యే సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో విద్యార్థుల సత్తా


పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

బడంగ్‌పేట్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే 3వ అంతర్జాతీయ చాంపియన్‌షిప్-24 పోటీల్లో బాలాపూర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్-10, అండర్-12, అండర్-14 బాల బాలికల విభాగంలో కటాస్, స్పైరింగ్‌లో పాల్గొని బంగారు పతకాలు-7, వెండి పతకాలు-5, కాంస్య పతకాలు-2 సాధించారు. నిర్వాహకులు సత్తాచాటిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలతో పాటు, కరాటే చాంపియన్ షిప్ ట్రోఫీలను అందజేశారు. సోమవారం పాఠశాలలో యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎం.ఎం.షరీఫ్, ప్రెసిడెంట్ పి.జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇ.శివకుమార్, అంజనాదేవి, ప్రిన్సిపాల్ శైలజ, కరాటే మాస్టర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లోని 15వ డివిజన్‌లో బీటీ రోడ్డు పనులను సోమవారం అధికారులతో కలిసి మేయర్ పారిజాతరెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు పరిశీలించారు. ఆర్చిడ్ కాలనీలో గుంతలమయమైన రోడ్లతో కాలనీవాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కాలనీవాసుల విన్నపం మేరకు బీటీ రోడ్డు మంజూరు చేయించి పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ చైర్మన్ అఫ్జల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డిని పరామర్శించిన తీగల


దయాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త, బీఆర్ఎస్ నాయకుడు పారుపల్లి దయాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హుడాకాలనీలోని దయాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రజాసేవతో పాటు ఆరోగ్యాన్ని కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు బేర బాలకిషన్, అరవింద్‌కుమార్, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌గుప్తా, సుదర్శన్ ముదిరాజ్, రిషి తదితరులున్నారు.

పోటీ ప్రపంచానికి తగినట్లు విద్య

మీర్‌పేట: క్రీడో ప్రయోగశాలలో విద్యనభ్యసించడం ద్వారా ప్రావీణ్యం గల పౌరులుగా తయారవుతారని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. సోమవారం మీర్‌పేట జిల్లెలగూడలోని లార్డ్స్ పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులు చదివే 'క్రీడో' కార్యక్రమంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రసుత్త పోటీ ప్రపంచం, పెరుగుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యాసంస్థల్లో నాణ్య మైన విద్యను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సరిత, క్రీడో ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడులు సరికావు

హుడాకాంప్లెక్స్: అచ్చంపేటలో మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని సరూర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం మీడియా కమిటీ చైర్మన్ కాకొళ్ల రాజుగుప్తా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్యులు మార్కెట్ చైర్మన్‌గా ఉండడం కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. సమాజంలో అన్ని కులాలతో పాటు వైశ్యులకు కూడా రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందన్నారు. తూకాలలో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే అధికారులకు ఫిర్యాదులు చేయాలి కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.